"మళ్ళీ ఇదే చేశావేమ్మా, నోటికి రుచించటం లేదు" అయిష్టంగా ముఖం పెట్టింది.

"అబ్బబ్బ ఏదో ఒకటిలేమ్మా, తిను. వేళకింత ఉడకేయగలుగుతున్నాను, అక్కడికి గొప్పనుకో. ఇప్పుడు చపాతీ చేయటం అంటే ఎంత కష్టమో తెలుసా?" అసలే ఆఫీసులో పని ఎక్కువగా వుందీ రోజు. విసురుగా వంటింటిలో నుండి వచ్చేశాను అన్నం గిన్నె ముందు పెట్టి.

గుజ్జర్లమూడి నిర్మలారాణి

# "అమ్మ అన్నది..."



"అమ్మా, బిస్కత్తులు తెస్తానన్నావ్, ఏవి?" మూడేళ్ళ వంటిది కాళ్ళకి అడ్డం పడింది.

"సాయంత్రం పాయసం చేస్తానన్నావుగా, తే" ఐదేళ్ళ బాబుగాడు చీర కుచ్చెళ్ళు పట్టుకుని లాగుతున్నాడు.

"రేపు తెస్తానమ్మా, నీకు కూడా రేపు తప్పక పాయసం చేసిపెడతాగా" చీర కుచ్చెళ్ళు విడిపించుకుంటూ అన్నాను.

"ఊ, ఊ ఏం వద్దు. ఇప్పుడే బిక్కి కావాలి."

"నాక్కూడా ఇప్పుడే పాయసం కావాలి."

అసలే చిరాగ్గా వున్నానేమో కోపం పట్టలేక ఇద్దర్నీ ఎడా పెడా వాల్లు వాయించాను.

పిల్లల ఏడుపు తారాస్థాయి నందుకుంది.

"దరిద్రపు పిల్లలు ఎప్పుడూ తిండి ధ్యాసే. నోరు మూస్తారా, లేదా? శబ్దం వచ్చిందంటే చంపేస్తాను" పిచ్చి కోపంతో మళ్ళీ చెయ్యి ఎత్తాను.

అమ్మ మధ్యలో అడ్డుపడి, పిల్లల్ని బయటికి తీసుకెళ్ళింది.

తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాను.

చాల అలసటగా వుంది. ఆఫీసు పని, ఇంటి పని, వంట పని, పిల్లలు, వాళ్ళ ఏడుపులు, పెడబొబ్బలు- ఓహ్ ప్రాణం పోతూంది. అది చాలక వయస్సు మళ్ళిన అమ్మ ఒకటి. ఆవిడకి ఉప్పు, కారం ఏవీ తగలకూడదు. పైగా షక్కెర వ్యాధి. రోజుకి నాలుగు రకాల వంటలు చేయలేక చస్తున్నాను.

తల పగిలిపోతూంది. ఒక ప్రక్క కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఆకలి అనుకోగానే ఆలోచనలు పిల్లల మీదికి మళ్ళాయి. పాపం చాలా ఏడ్చారు. అంతగా కొట్టకుండా వుండవలసింది. ఉదయం ఏం తిన్నారో, ఏమో! ఖాళీ పొట్టలకి ఆకలి వేసి వుంటుంది. అందుకే మారాం అనుకుంటూ ప్రక్కింటి అబ్బాయికి డబ్బులిచ్చి బిస్కెట్ పాకెట్ తెమ్మని పంపాను. వాడు వచ్చేలోగా పాయసం చేయటం, మా వారు రావటం కూడా జరిగింది. అందరం భోజనాలకు కూర్చున్నాం. పిల్లలకి కొసరి, కొసరి తినిపించాను. వాళ్ళడిగినవి ఇచ్చాను కాబట్టి, సంతోషంతో మారాం చేయకుండా తిన్నారు.

వంటిల్లు సర్దుతూ ఉలిక్కిపడ్డాను. అమ్మకు వడ్డించిన కంచంలో గోధుమ రవ్వ అన్నం, పప్పు ఎట్లా పెట్టినవి అట్లాగే వున్నాయి. అమ్మతో నేనన్న మాటలు గుర్తువచ్చి మనస్సు చివుక్కుమంది.

ఎంత కఠినంగా మాట్లాడాను. వేళకింత ఉడకేసి పెట్టడమే గొప్ప అన్నాను కదూ! ఈ రోజు నాకే మయింది? శివ శివా. నా పిల్లల కోసం క్రింద మీద పడి, లేని ఓపిక తెచ్చుకుని ఎంత కష్టపడుతున్నాను. అలాంటి తల్లి మనసుతోనే కదూ నన్నూ పెంచి, పెద్దచేసి, ఇంతదాన్ని చేసింది? అలాంటి తల్లిని ఎంత చిన్నచూపు చూశాను? భగవంతుడా, రేపు నా పిల్లలూ ఇంతేనా?

చేతికందిన అరటిపండ్లు తీసుకుని అమ్మ మంచం దగ్గరికి వెళ్ళాను.

అమ్మ అప్పటికే ని దలోకి జారుకుంది.

** ** **

ఇంకా చీకట్లు పూర్తిగా తొలగలేదు.

వంటింట్లో మినప వడ చేస్తున్నాను. అమ్మకి అవి చాల ఇష్టం.

"అమ్మాయ్ వాసంతీ! నన్నీరోజు బస్సెక్కించవే. మా అక్క దగ్గరకు వెళ్తాను."

సిగ్గుతో చితికిపోయాను.

"వద్దమ్మా, నువ్వెక్కడికీ వెళ్ళొద్దు. మాతోనే వుండాలి" ఇంకేం మాట్లాడలేక ఆవైపు తిరిగాను.

"నీ పనులే నీకు తెమలకుండా వుంది. అది చాలక నేను..." గొంతు దుఃఖంతో పూడిపోయింది.

"నీవల్ల కాదు తల్లీ, నీ ఆరోగ్యం చెడుతుంది ఇంత పనితో" అమ్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"నాకేమీ కాదు. అంతగా అయితే వంట మనిషిని పెట్టుకుందాం. ఇదుగో నీకిష్టమైన ఉద్దివడ" మెత్తగా వేసిన ఒక వడ తుంచి అమ్మ బోసి నోటిలో కుక్కాను.

*



**అసలు విషయం**

"ఏంటి శివరాం యిప్పుడు మీ భార్య నువ్వు చెప్పినట్లు వింటుందటగా ఎలా తొంగదీసావ్?" అడిగాడ స్నేహితుడు నాగు.

"ఆమె పేర లక్ష రూపాయలు బీమా చేసాన్లే!" అసలు విషయం చెప్పాడు శివరాం.

— శ్రీరంగ, భద్రాచలం